క్లుప్తంగా

ఆత్మరక్షణకు తైక్వాండో



క్రీడాకారులను అభినందిస్తున్న హీరో సుమన్

కర్నూలు (టౌన్) : ఆత్మరక్షణకు తైక్వాండో శిక్షణ ఉపయోగపడుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. ఇటీవల కలర్ బెల్టులు, మెడల్స్ సాధించిన తైక్వాండో క్రీడాకారులను ఆయన స్థానిక బళ్లారి చౌరస్తాలోని ఒక హోటల్‌లో సోమవారం అభినందించారు. అలాగే ఆల్ ఇండియా గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన ఫరతుల్లాను ఆయనతో పాటు డీఎస్పీ మహబూబ్‌బాషా, కోచ్ జి. షబ్బీర్ హుస్సేన్ అభినందనలు తెలిపారు. విద్యార్థులు క్రీడలను తమ జీవితంలో భాగంగా ఎంచుకోవాలని సుమన్ సూచించారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్‌గా వచ్చిన పి.రంజిత్‌బాషాను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలసి బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తే నిధుల సాధించేందుకు తమ వంతు కృషి చేస్తానని ఎంపీ వివరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కురువ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచితంగా కోచింగ్ ఇవ్వాలి



మాట్లాడుతున్న నగేష్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే టెట్, డీఎస్సీ, గ్రూపు-2,ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ సదుపాయం కల్పించాలని డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఒక కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కాగా, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో కనీస వసతులు లేకున్నా రూ.12 వేల నుంచి 60 వేల వరకు వసూలు చేస్తుండడంతో పేద, మధ్యతరగతి వర్గాల అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు ఉచిత శిక్షణతోపాటు మెటీరియల్, నెలకు రూ.10 వేలు స్కాలర్‌షిప్ కింద చెల్లించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు హుస్సేన్‌బాషా, హరి, విజయ్, వంశీ పాల్గొన్నారు.

బుక్కాపురం అరటి పొలాల్లోకి చిరుత

మహానంది: మహానంది, తిమ్మాపురం గ్రామాల పరిధిలో కొద్దిరోజులుగా సంచరిస్తున్న చిరుత తాజాగా సోమవారం ఉదయం బుక్కాపురం సమీపంలోని అరటిపొలాల వైపు వచ్చినట్లు రైతులు తెలిపారు. గ్రామంలోని రైస్ మిల్లు సమీపం నుంచి వెళ్లే మార్గంలో ఉన్న అరటిపొలాల వద్ద చిరుత కనిపించినట్లు రైతులు చెప్పారు. నల్లమల సమీప గ్రామాల ప్రజలు చీకటి పడితే చాలు బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. మహానందిలోని దేవస్థానం కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతం శివారు వైపు ఇద్దరు మహిళలు బహిర్భూమికి వెళ్లగా చిరుతను చూసి పరుగులు తీసిన విషయం తెలిసిందే. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించే చర్యలు తీసుకోకపోతే మూడు గ్రామాల ప్రజలు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సోమవారం భోళాశంకరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. అనంతరం భక్తులు క్షేత్ర పరిధిలోని ఉపాలయాలు, శ్రీశైలంప్రాజెక్టును సదర్శించారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్



వైఎస్సార్ సర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పండుగలా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు
- మహానేత జనరంజక పాలనను స్మరించుకున్న నాయకులు
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘన నివాళి
- ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ





వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, వృద్ధాశ్రమంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న కేఎం అన్వర్ హుస్సేన్

కర్నూలు (టౌన్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేద ప్రజల గుండె చప్పుడు అని వైఎస్సార్‌సీపీ నేతలు కొనియాడారు. సోమవారం వైఎస్సార్ 75 జయంతిని పురస్కరించుకుని నగరంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు మహానేత జనరంజక పాలనను స్మరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎస్‌బీఐ సర్కిల్‌లో వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. జోహార్ వైఎస్సార్ అంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పాలన ఒక స్వర్ణయుగమన్నారు. ఆయన చనిపోయి 15 సంవత్సరాలు అవుతున్నా లక్షలాదిమంది పేదల గుండెల్లో నిలిచిపోయారన్నారు. మహానేత కులమతాలకు అతీతంగా పాలన సాగించారన్నారు. కార్మికులు, కర్షకులకు అండగా నిలిచారన్నారు. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో మంచి పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారన్నారు. ఆయా పథకాలతో ఆయన ప్రజల మదిలో చెరగని స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. దివంగత వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్లు చక్కటి పాలన అందించారన్నారు. పేదల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ పాలన భావి తరాలకు ఆదర్శమన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేర్చిన మహనీయుడు అని కొనియాడారు. రాష్ట్రంలో ఫ్యాక్షనిజం రూపుమాపారన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేశారని గుర్తు చేశారు. వైఎస్ జగనన్న సైతం ఆయన అడుగు జాడల్లో నడుస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల పక్షపాతి డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. మరణించిన తరువాత కూడా పేద ప్రజల గుండె చప్పుడుగా నిలిచారన్నారు. ఆయన హయాంలో ప్రారంభమైన సంక్షేమ పథకాలు ఇప్పటికీ కొనసాగడం విశేషమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న జగనన్నకు అందరం తోడుగా ఉండాలన్నారు. మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అలీఖాన్, గద్దం రామక్రిష్ణ, కార్పొరేటర్లు క్రాంతి, మునెమ్మ, యూనస్, జుబేర్, షేక్ మహమ్మద్, రాజేశ్వర రెడ్డి, పార్టీ నాయకులు ఆది మోహన్ రెడ్డి, మద్దూరి సుభాష్ చంద్రబోస్, దేవపూజ ధనుంజయ ఆచారి, కర్జాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేఎం అన్వర్ హుస్సేన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, కటారి సురేష్, ధర్మపేట కుమార్ పాల్గొన్నారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని నగర శివారులోని దిన్నెదేవరపాడులో ఉన్న కేర్ హోమ్స్ మిషన్ సొసైటీలోని వృద్ధాశ్రమం (మతి స్థిమితం లేని)లో అన్వర్ హుస్సేన్ కేక్ కట్ చేశారు. తర్వాత ఆశ్రమంలోని వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

జన హృదయ నేత రాజన్న

కర్నూలు(సెంట్రల్) : జన హృదయ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని డీసీసీ అధ్యక్షుడు కె.బాబు రావు అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఎస్‌బీఐ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, డీసీసీ గౌరవాధ్యక్షుడు ఉండవెల్లి వెంకటన్న, డీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డీసీసీ ఉపాధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్, కె.వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ చైర్మన్ ఈ.లాజరస్ పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత వైఎస్సార్

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఎందరో ప్రాణాలు కాపాడి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య ప్రదాతగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని సోమవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని ఆయన విగ్రహం దగ్గర 29వ వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా మహానేత విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని పూలమాల వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయాల కోసం తాము పని చేస్తున్నామన్నారు. 108, 104 అంబులెన్స్‌లను ప్రవేశపెట్టి పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యమందించిన ఘనత దివంగత నేతకే దక్కుతుందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన విధానం ఉమ్మడి ఏపీలో లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేసిందన్నారు. పేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఎంతో కష్టపడ మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. ఉమ్మడి ఏపీలో అనేక సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయంపై ఆధారపడ్డ రైతుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమను సస్యశ్యామలంగా మార్చారన్నారు.అంతేకాకుండా పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఫీజు రీయింబర్స్ మెంట్‌ను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు చిట్టెమ్మ, గాజుల శ్వేతారెడ్డి, వైజా అరుణ, శ్రీనివాసులు, నరసింహులు, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరెడ్డి, అర్బన్ వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ ఆచారి, జయన్న, కృష్ణమూర్తి, హేమలత, రాజు, హుస్సేన్ ఆలం, శివారెడ్డి, రత్నం, కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో వృద్ధుడికి జైలుశిక్ష



పోలీసుల అదుపులో పాపయ్య

కర్నూలు (హాస్పిటల్): నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి కేసులో 75 ఏళ్ల వృద్ధుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి జి. భూపాల్‌రెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే..నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం పశ్చిమ ప్రాత కోట గ్రామంలో 2020 నవంబర్ 18న నాలుగేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన నిందితుడు మర్రిమామ పాపయ్య అలియాస్ అలంపూర్ పాపయ్య లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తన ఇంటి బయట ఆడుకుంటుండగా వృద్ధుడు మాయమాటలు చెప్పి అతని ఇంట్లోకి పిలుచుకెళ్లి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. తర్వాత ఇంటికి వెళ్లిన బాలిక శరీరంపై దుస్తులు తిరిగేసి ఉండటాన్ని ఆ చిన్నారి పిన్ని గమనించింది. విచారించగా బాలిక జరిగిన విషయం చెప్పింది. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ముచ్చుమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ శ్రుతి దర్యాప్తు చేసి నిందితుడిపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి తీర్పు వెలువరించారు.

తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

- సినిమా యాక్షన్ సీన్‌ను తలపించిన వైనం
- భయభ్రాంతులకు గురైన ప్రజలు



కోడుమూరులో ఒకరినొకరు తన్నుకుంటున్న టీడీపీ నాయకులు

కర్నూలు: కోడుమూరులో ఓ స్థల వివాదంలో టీడీపీ నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. తెలుగు తమ్ముళ్ల గొడవ ఆద్యంతం యాక్షన్ సినిమాను తలపించింది. సోమవారం రాత్రి సుమారు 20 మందికిపైగా తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకుంటూ, రాళ్లతో కొట్టుకుంటూ కోడుమూరు నడిబొడ్డులో, పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో బీభత్సం సృష్టించారు. తెలుగు తమ్ముళ్ల గొడవను చూసిన ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురై పరుగులు తీయగా, ఏమి జరుగుతుందో తెలియక వ్యాపారస్తులు దుకాణాల షట్టర్లు మూసి వేశారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి గొడవకు పాల్పడుతున్న వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపుచేశారు. ఈ గొడవకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

బెల్లయ్య నాయక్ నియామకంపై హర్షం



మాట్లాడుతున్న కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా.తేజావత్ బెల్లయ్య నాయక్‌కు తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్ ట్రైబ్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం హర్షణీయమని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కై లాస్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బెల్లయ్యనాయక్ మూడు దశాబ్దాలుగా గిరిజనుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించడంలో ఆయన ఘననీయమైన పాత్ర పోషించారన్నారు. గిరిజనుల కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజునాయక్, నాయకులు రామునాయక్, రామాంజనేయ నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెండో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): నగర జనాభా రోజురోజుకు విస్తరిస్తున్న నేపథ్యంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో కర్నూలు న్యూసిటీ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నగరానికి నీటి ఎద్దడి పొంచి ఉన్న నేపథ్యంలో రెండో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం అవసరమన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోతే తాము ప్రజల తరపున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.రాముడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

ఇక... హలో కేఎంసీ

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హలో ఎఎంసీ పేరుతో సాధారణ ప్రజలు తమ కాలనీ సమస్యలను ఎక్కడికి వెళ్లకుండా ఫోన్ ద్వారానే ఫిర్యాదు చేసి పరిష్కరించుకునే సౌకర్యాన్ని కల్పించినట్లు కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యలు, అంతరాయం, చెత్త సేకరణ, పూడిక తీత, వీధి దీపాలు, రోడ్డు మరమ్మతులు, ఫాగింగ్ వంటి సమస్యలకు 7422992299 అనే హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. నగర ప్రజల విలువైన సమయం వృథా కాకుండా సమస్యలను సులువుగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖ నెలకొల్పిన టవర్లపై 33కేవీ లైన్ లాగే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంగళవారం కూడ టవర్‌లపై లైన్ లాగుతున్నందున వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈ నాగప్రసాద్ తెలిపారు. బాబా బృందావన్ నగర్, కమాండెంట్ డీటీఆర్, 4వ పట్టణ పోలీస్ స్టేషన్, రాజీవ్ నగర్, నిర్మల్‌నగర్, గోపినగర్, వాసవి నగర్, మల్లారెడ్డి రిచ్‌మండ్, సన్‌రైజ్ ఓమ్స్, లక్ష్మిగ్రీన్‌సిటి, గీతాంజలి వెంచర్స్, ఎమ్మెస్ నాయన అపార్టుమెంట్సు, గురుబ్రహ్మ నగర్ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కల్లూరు: 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం 104 ఉద్యోగులు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని మాధవీ నగర్‌లో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వడంతో పాటు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేష్, చంద్రహాస్, మంజుల, కళ్యాణి, ఇలియాస్, మల్లికార్జున, మధుసూదన్, రాజు, వినోద్, హసన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ వేలంపాట

కోడుమూరు రూరల్: కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి 2024-25 సంవత్సరానికిగాను వారపు సంతమార్కెట్, దినసరి మార్కెట్, మాంసం మార్కెట్ నిర్వహణకు సంబంధించి మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ. అజయ్‌భాస్కర్ సోమవారం తెలిపారు. 09-07-24 నుంచి 31-03-25 వరకు 9 నెలలపాటు ఆయా వ్యాపారాలకు సుంకం వసూలు చేసుకునే హక్కులకు వేలాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. వారపు సంత మార్కెట్‌కు రూ.3 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.3 లక్షలు, మాంసం మార్కెట్‌కు రూ.50 వేల చొప్పున దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని, వేలం దక్కించుకున్న వారు వెంటనే మిగతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : ప్రజా సమస్యలకు సంబంధించిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. సోమవారం స్థానిక నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి నగరపాలక కమిషనర్ దరఖాస్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 39 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుడదని కార్యక్రమం పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించే విధంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఆర్ఓ జునీద్, మేనేజర్ చిన్నరాముడు, టిడ్కో అధికారి పెంచలయ్య, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఏసీపీ రంగస్వామి పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే...
- ధర్మపేట రైల్వే బ్రిడ్జి వద్ద మరుగుదొడ్లలో మరమ్మతులు చేపట్టాలని, దీపక్ ఆసుపత్రి వద్ద మురుగుకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని ధర్మపేట ఏరియా సంక్షేమ సంఘం నాయకులు విన్నవించారు.
- మమతనగర్‌లో తన ప్లాటుకు రీసర్వే చేయాలని సుబ్బయ్య అనే వ్యక్తి కోరారు.
- 45 వ వార్డు శ్రీకృష్ణ కాలనీలో, శ్రీనగర్ కాలనీ, కేసీ కెనాల్ వద్ద బోర్లు వేయించాలని స్థానిక కార్పొరేటర్ మాణిక్యమ్మ వినతిపత్రం అందజేశారు.
- వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్టీఆర్ బిల్డింగ్‌లలో మున్సిపల్ పైపులైన్ లీక్ అవుతుందని స్థానికులు కృష్ణకుమారి విన్నవించారు.
- సీజనల్ వ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి వినతిపత్రం అందజేశారు.
- టిడ్కో గృహం కోసం కట్టిన నగదును వెనక్కి ఇవ్వాలని బాలాజీనగర్‌కు చెందిన సిరి అనే మహిళ కోరారు.
- మారుతి నగర్, జ్యుడీషియల్ కాలనీలకు మధ్య ఉన్న పార్కుకు గేటు ఏర్పాటు చేయాలని స్థానికులు పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి కమిషనర్‌ను కోరారు.
- మున్సిపాల్టీలో నీటి ఫిల్లింగ్ రుసుం రూ.300 తగ్గించాలని జిల్లా ప్రైవేటు ట్యాంకర్స్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- వీడిన హత్య కేసు మిస్టరీ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నల్లప్ప

పాణ్యం: మండలంలోని మద్దూరు గ్రామంలో ఈనెల 2వ తేదీ జరిగిన హత్యకు వివాహేతర సంబంధమే కారణమని సీఐ నల్లప్ప తెలిపారు. సోమవారం హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన దూదేకుల పెద్ద దస్తగిరి ఈ నెల 2వ తేదీ మద్దూరు బీసీ కాలనీలో గ్రామస్తులతో మాట్లాడుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన వల్లపు వడ్డే రామాంజనేయులు, సంద్యాల మండలం కొట్టాల గ్రామానికి చెందిన గోగుల హరి, పుట్ట శ్రీనివాసులు, పెద్ద కొట్టాలకు చెందిన పుచ్చకాయల రవితేజ ఏపీ39ఈడీ5474 నంబర్ గల కారులో గొడ్డలి, కత్తి, రెండు కర్రలతో పెద్ద దస్తగిరి ఇంటికి వచ్చి ఒక్కసారిగా అతనిపై దాడి చేసి హత్య చేశారు. మృతుడు పెద్ద దస్తగిరి పెద్ద కుమారుడు దూదేకుల మదర్‌షావలి అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని.. ఈ కారణంగా దూదేకుల పెద్ద దస్తగిరిని హత్య చేశారని సీఐ వెల్లడించారు. నిందితులను మద్దూరు- బ్రహ్మణపల్లె క్రాస్ రోడ్డులో అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి కారు, కత్తి, రెండు కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సకాలంలో స్పందించి నిందితులను పట్టుకునేలా చొరవ చూపిన కానిస్టేబుళ్లు నాగార్జున, వెంకటేశ్వర్లు, మన్సూర్‌లను అభినందించారు.

దాస్ పాలేపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(హాస్పిటల్): బ్రాహ్మణులను కించపరిచిన దాస్ పాలే అనే వ్యక్తిని అరెస్ట్ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద వివిధ బ్రాహ్మణ సంఘాల నేతలు ధర్నా నిర్వహించారు. బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో బ్రాహ్మణులను కించపరుస్తూ మాట్లాడటం, విమర్శించడం కొందరికి ఫ్యాషన్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్తులు బ్రాహ్మణులే కాదని వారు అధములు, నీచులు అని దుర్భాషలాడిన దాస్ పాలే అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నేతలు కోలుకుల చంద్రశేఖర్ , దేవెళ్ల వసంత సాయినాథ శర్మ, టీవీ రవిచంద్ర, సముద్రాల శ్రీధర్, కంచుగంటల శ్యామ సుందర్ రావు, మామిళ్ల పల్లి రాజేష్, రెంటచింతల సుధాకర శర్మ, శంకర్ దత్త, సునీల్ శర్మ, శివ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.